
## గాంధీ ఆస్పత్రి వద్ద నర్సింగ్ విద్యార్థుల ఆందోళన

**సికింద్రాబాద్, నవంబర్ 7 ప్రభాతవార్త :**
మురుగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నర్సింగ్ విద్యార్థులు సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రధానభవనం వద్ద ఆందో ళన చేపట్టారు. బోయిగూడలోని హాస్టల్‌లో నిత్యం డ్రైనేజీ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు విచారం వ్యక్తం చేశారు.ఇప్పటికే దాదాపు నెల రోజులు కావస్తుందని, మరికొన్ని రోజులలో పరీక్షలు కూడా ఉన్నాయని తెలిపారు. అప్పటిలోగా మా క్కుడా రోగాలు వచ్చే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. హాస్టల్ లో గత కొంతకాలంగా డ్రైనేజీ సమస్యలు వస్తున్నాయని, వాటిని పరి ష్కరించాల్సి ఉండగా మమ్మల్ని మనుషుల్లాగే చూడడం లేదని ఆరో పించారు. హాస్టల్‌లో ఉండడం ఇబ్బందిగా ఉందని చెప్పారు. సూప రింటెండెంట్‌కు ఫిర్యాదు చేసినా పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. దాదాపు రెండున్నర గంటల పాటు ఆందోళన చేపట్టారు.



హైదరాబాద్ వార్త






## అంగన్వాడీ సేవలు అందరికీ అందేలా చర్యలు తీసుకోవాలి

**-సిడిపిఓలు, సూపర్వైజర్లు ప్రతినెల తనిఖీలు చేయాలి**
**-జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సంక్షేమాధికారి అక్కేశ్వర్‌రావు

**హైదరాబాద్, అక్టోబరు 7,ప్రభాతవార్త:**
అంగన్వాడి సేవలు అందరికీ అందేలా తగిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురుశెట్టి ఐసిడిఎస్ అధికారులు ఆదేశించారు.గురువారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమగ్ర శిశు అభివృద్ధి సేవ ఐసిడిఎస్ సేవలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం కోసం ఒక నిర్ణీత దినమును కేటాయించుటకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అంగన్వాడి స్వంత భవనాలలో మరియు కమ్యూనిటీ భవనాలలో నిర్వహిస్తున్న వాటిలో త్రాగునీరు, మరుగుదొడ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేని వాటి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. అంగన్వాడీలను అక్రిడేషన్ త్వరగా పూర్తి చేయాలని అన్నారు. స్పెషల్ గ్రోత్ మానిటరింగ్ నిర్వహించిన డేటా శాతాన్ని సమర్పించాలని ఆయన అన్నారు. సిడిపిఓలు, సూపర్వైజర్లు ప్రతినెల నిర్దిష్టమైన తనిఖీలు చేపట్టాలని ఆయన సూచించారు. పిల్లల బరువు, తీవ్ర లోపపోషణ, సరిగా బరులేని పిల్లల సంఖ్య ఇవ్వవలసిందిగా ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, సిడిపిఓలు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## గ్రేటర్‌లో ముమ్మరంగా " సమగ్ర కుటుంబ సర్వే"

**-ఇప్పటివరకు 13.35లక్షల ఇండ్లకు స్టిక్కర్లు**



కుటుంబ వివరాలు సేకరించిన స్టిక్కర్లు వేస్తున్న ఎన్యూమరేటర్

**హైదరాబాద్, నవంబర్ 7,ప్రభాతవార్త:**
సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిహెచ్ఎంసి లో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే నవంబర్ 6 నుండి సర్వే రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో జిహెచ్ఎంసి లో మొదటి దశలో ఎన్యుమరేటర్ బ్లాక్ లో ప్రతి ఇంటిలో గల కుటుంబాల వివరాలను నమోదు చేస్తూ వాటికి సంబంధించిన ఇంటి నంబర్, కుటుంబ యజమాని పేరుతో కూడిన ఇండ్ల జాబితా తయారు చేయడంతో పాటు స్టిక్కర్ ఇంటి గోడల పై అతికిస్తున్నారు. ఈప్రక్రియ ఈనెల 8వరకు జరగనుంది. నేటి వరకు 13,35,673 ఇళ్లను లిస్ట్ పూర్తి చేసి ప్రతి ఇంటికి స్టిక్కర్ వేసారు. శుక్రవారం స్టిక్కర్ వేసే ప్రక్రియ ముగియనున్నది. రెండో దశలో 9 తేదీ నుండి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ను చేపట్టనున్నారు. క్షేత్ర స్థాయిలో సర్వేలో కుటుంబం యొక్క సామాజిక, ఆర్థిక, విద్య ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే (సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) ఎన్యూమరేటర్లు సేకరించిన డేటా ను కంప్యూటరైజ్ చేసి గోప్యంగా ఉంచుతారు. ఈ సర్వే ప్రకారం గా ప్రభుత్వం అమలు చేసే పథకాలలో అర్హులైన వారిని గుర్తించి ఈ నేపథ్యంలో సర్వేను ఎప్పటికిప్పుడు పర్యవేక్షణకు డిప్యూటీ, జోనల్ కమిషనర్లు పరిశీలిస్తారు. వీరితో పాటు 10 మంది నోడల్ అధికారులను నియమించారు.

## వేసవి డిమాండ్ తట్టుకునేలా పటిష్టమైన చర్యలు

**-టిజిఎస్‌పిడిసిఎల్ సిఎండి ముషారఫ్ ఫరూఖి**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిఎండీ ముషారఫ్ ఫారూఖీ

**హైదరాబాద్, నవంబర్ 7, ప్రభాతవార్త:**
రానున్న వేసవిలో ఏర్పడే అధిక విద్యుత్ డిమాండ్‌ను తట్టుకునేలా పంపిణీ, ట్రాన్స్ మిషన్ వ్యవస్థను మెరుగుపర్చాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ముషారఫ్ ఫరూఖీ ఐఏఎస్ అధికారులను సూచించారు. ఈమేరకు గురువారం, మింట్ కాంపౌండ్ లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ట్రాన్స్‌కో డైరెక్టర్ ట్రాన్స్మిషన్ జగత్ రెడ్డి, ఇతర ఇంజినీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సిఎండీ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ నగరం లో వేసవి కాలంలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయిలో నమోదవుతుందన్నారు. గతేడాది 3756 మెగావాట్లుగా నున్న గరిష్ట డిమాండ్ ఈ ఏడాది దాదాపు 16 వృద్ధి తో 4352 మెగావాట్ల గా నమోదయ్యిందని గతేడాది 81.39 మిలియన్ యూనిట్లుగా నున్న వినియోగం దాదాపు 12 వృద్ధితో 90.68 మిలియన్ యూనిట్లకు చేరిందన్నారు. రాబోయే 2025 వేసవిలో సైతం విద్యుత్ డిమాండ్ గతం కంటే ఎక్కువగా రికార్డు స్థాయిలో సుమారు 20 25 వృద్ధి నమోదు అవుతుందని అంచనా వేస్తున్నామన్నారు. గ్రేటర్ హైదరాబాద్ శివారు ప్రాంతాలైన నెమలి నగర్, గోపన్ పల్లి, కోకాపేట్, కోహెడ, తట్టి అన్నారం, అబ్దుల్లాపూర్ మెట్, మాన్సాన్ పల్లి, అజీజ్ నగర్, కందుకూరు, కే సింగారం, మల్లాపూర్, వాయుపురి, ఉప్పల్ భాగాయత్, దుండిగల్ వంటి ప్రాంతాల్లో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరుగుతున్నది. ఆ ప్రాంతాల్లో అవసరానికి తగ్గట్టు 220/132/33 కేవీ సబ్ స్టేషన్స్ ఏర్పాటు, ఇతర నెట్వర్క్ ను పటిష్టం చేయడానికి తగు చర్యలు చెప్పట్టాలని సీఎండీ దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం చేపడుతున్న నిర్వహణ మరమ్మతు పనులను నాణ్యత ప్రాణాలు పాటిస్తూ నిర్దేశిత సమయానికి పూర్తి చేయాలన్నారు. నిర్వహణ పనుల కోసం తీసుకుంటున్న లైన్ క్లియరెన్స్ (ఎల్‌సి) విషయం లో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎల్‌సిలు తీసుకునేటప్పుడు ట్రాన్స్కో డిస్కం ఇంజినీర్లు సమన్వయము చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డైరెక్టర్ ఆపరేషన్ డా. నర్సింహులు, చీఫ్ ఇంజినీర్‌లు రాంజీ,చక్రపాణి, సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## కోకాపేట్‌లో సమగ్ర సర్వేను పరిశీలించిన కలెక్టర్



కోకాపేట్‌లో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి.

**నార్సింగి, నవంబర్ 7 ప్రభాతవార్త :**
రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట్‌లో జరుగుతున్న "సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను గురువారం కలెక్టర్ నారాయణరెడ్డి పరిశీలించారు. నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్, కమీషనర్ కృష్ణమోహన్‌రెడ్డిలతో కలిసి కోకాపేట్‌లో సర్వే జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేకు ప్రజలంతా సహకరించాలని సూచించారు. మీ ఇళ్ల వద్దకు వచ్చి మా సిబ్బంది అడిగే అన్ని రకాల ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలు చెప్పాలని, మీరిచ్చే సమాచారంను పొందు పర్చడం జరుగుతుందని, దీని ఆధారంగానే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పతకాల లబ్దిదారులను ఎంపిక చేసే అవకాశం ఉంటుందన్నారు. అధికారులు ఈ సర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతీ ఇంటి వివరాలు తప్పకుండా సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ యోగేష్, అకౌంటెంట్ కృష్ణయ్య, ఆర్.ఐ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# సీట్ బెల్ట్ ..ప్రాణదాతే..

**-వాహన ప్రయాణాల్లో వినియోగం తప్పనిసరి**
**-అసౌకర్యం అనుకుంటే ప్రాణాలకే ముప్పు**
**-ప్రమాదాల సమయంలో కీలక పాత్ర**

**హైదరాబాద్, నవంబర్ 7,ప్రభాతవార్త:**
"యాక్సిడెంట్ అంటే ..బైకో ,కారో రోడ్డుమీద పడిపోవడం కాదు.. ఒక కుటుంబం మొత్తం రోడ్డున పడిపోవడం "ఓతెలుగు సినిమా డైలాగ్ ఇది. కానీ ఇందులో జీవితం ఉంది. రోడ్డుప్రమాదంలో కుటుంబ పెద్దప్రాణాలు కోల్పోతే ..మొత్తం కుటుంబమే అనాథ అవుతుంది. అందుకే ..రోడ్డెక్కామంటే గమ్యం చేరేవరకు అప్రమత్తంగా ఉండాల్సినదే..కానీ చాలామంది అంతులేని నిర్లక్ష్యం వహిస్తుంటారు. చిన్నసీటుబెట్లు ప్రాణాన్ని కాపాడుతుందని..కుటుంబాన్ని రోడ్డున పడకుండా ఆపుతుందని తెలిసినా లైట్ తీసుంటారు. వాస్తవానికి మోటారు వాహన చట్ట నిబంధనల ప్రకారం ద్విచక్రవాహనదారులు హెల్మెంట్..కార్ల ఇతర వాహనాలను నడిపేవారు సీటు బెల్ట్ ధరించడం తప్పనిసరి. కానీ ఎక్కడ చూసినా ఈనిబంధనలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. నగరాల్లో ప్రయాణిస్తున్నప్పుడు వాహనదారులు ట్రాఫిక్ పోలీసుల జరిమానాలకు భయపడి సీట్‌బెల్ట్ ధరిస్తున్నా హైవేలపై ప్రయాణాల్లో మాత్రం సీట్‌బెల్ట్‌పెట్టుకోవడం లేదు. కొన్ని సందర్భాల్లో డ్రైవింగ్ సీట్లో కూర్చునేవారు మినహా వారు వాటిని ఉపయోగించట్లేదు. సీట్‌బెల్ట్ ధరించకపోతే అలారం మోగేలా కార్ల తయారీ కంపెనీలు సాంకేతికను అభివృద్ధి చేశాయి. దీన్ని తప్పించుకోవడానికి చాలామంది సీట్‌బెల్ట్ బకెల్‌ను దాని సాకెట్‌లో పెట్టి బెల్ట్‌ను మాత్రం తమకు,సీటుకు మధ్య ఉంచుతున్నారు. అయితే ఈబకెల్స్ ద్వారా అలారం మోగకుండా ఆపినా ప్రమాదం జరగకుండా ఆపలేమని పోలీసులు అంటున్నారు.

**సీటుబెల్ట్ ధరించకుంటే..**
నిర్ణీత వేగంతో వెళ్తున్న కారులో ప్రయాణికులు స్థిరంగా కూర్చున్నప్పటికీ వాహనం దేన్నయినా గద్దుకున్నా లేదా హఠాత్తుగా వేగాన్ని కోల్పోయినా అందులోని వారు అదేవేగంతో ముందుకు



వెళ్తారు. ఫలితంగా ముందుసీటు, వెనక సీట్లలో కూర్చున్నవారు అద్దం తదితరాలను అత్యంత వేగంగా ఢీకొంటారు. ఒక్కోసారి వాహనం పల్టీకొడితే అద్దాల్లోంచి లేదా డోర్ ఊడిపోతే అందులోంచి బయటకు ఎగిరిపడతారు. ఫలితంగా తల, ముఖం, తదితర చోట్ల తీవ్ర గాయాలై మరణిస్తుంటారు.

**సీటుబెల్ట్ ధరిస్తే..**
సీటు బెల్ట్ ధరించి ప్రయాణిస్తున్నప్పుడు ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొన్నా లేదా కారు పల్టీలు కొట్టినా ఒక్కసారిగా బ్రేక్ వేయాల్సి వచ్చినా ప్రయాణికులు వాహనంలోంచి ఎగిరిపడకుండా కాపాడుతుంది. ముఖ్యంగా ప్రయాణికులు డ్యాష్‌బోరుడ్డ లేదా ముందుసీట్లకు గుద్దుకోకుండా సీట్‌బెల్ట్ వ్యతిరేక శక్తిని ప్రయోగిస్తుంది. ఫలితంగా ప్రయాణికులు మృత్యువాత పడకుండా కేవలం గాయాలతో బయట పడే అవకాశం ఎక్కువగా ఉంది.

**ఒక్కోసారి ఎయిరబ్యాగ్స్ ఉన్నా...**
అత్యాధునిక భద్రతా ప్రమాణాలు ఉండే కార్లు సైతం కొన్ని సందర్భాలలో ప్రయాణికుల ప్రాణాలు కాపడలేవని నిపుణులు చెబుతున్నారు. మితిమీరిన వేగమే అందుకు కారణమని విశ్లేషిస్తున్నారు. కొన్ని ప్రమాదాల్లో ఎయిర్ బ్యాగ్స్ స్పెన్సర్లు యాక్టివేట్ అయ్యి ,తెరుచుకోవడానికి కొంత సమయం పడుతుందని..సాధారంగా ఇది 0.05 సెకన్లుగా ఉంటుందని పేర్కొంటున్నారు వాహనం మితిమీరిన వేగంతో ఉన్నప్పుడు ఈసమయంలోపే డ్రైవర్ స్టీరింగ్ వరకు, పక్కసీట్‌లో ఉన్నవారు డాస్‌బోర్డువరకు ప్రయాణించి బలంగా ఢీకొట్టడం జరగుతుందని వివరిస్తున్నారు.

**వెనక కూర్చునే వారు మినహాయింపు కాదు..**
గతంతో పోలిస్తేకార్లలో సీటుబెల్టు ధరించడం గురించి అవగాహన పెరిగింది. అయితే అది ముందుసీట్లో కూర్చున్న వాళ్లకే పరిమితమవుతమవుతుంది. వెనక సీట్లో కూర్చునే వారికి తమకు నిబంధనలు వర్తించవని ఫీల్‌అవుతారు. 2022లో నిర్వహించిన ఓసర్వేలో వెనకవైపు ఉండే ప్రయాణికులను సర్వే చేయగా ..7శాతం మందే సీటు బెల్ట్ ధరిస్తున్నట్లు వెల్లడైంది. ఇటీవల లోకల్ సర్కిల్స్ అనే సంస్థ సర్వేలో భాగంగా వేలమందిని ఆరా తీయగా ..70శాతంమంది వెనకవైపు ఉండే వాళ్లు సీటు బెల్ట్ "ధరించే లే"అని చెప్పడం గమనార్హం. వాస్తవానికి కేంద్ర మోటార్ వాహన నిబంధనల్లో 138(3) నిబంధన కింద వెనుక సీట్లో కూర్చునేవారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాల్సిందే. లేదంటే వెయ్యిరూపాయలు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. దురదృష్టవశాత్తు దీనిగురించి అవగాహన ఉన్నవారు అంతంత మాత్రమే. అందుకే ముందు సీటు ప్రయాణికులతోపాటు వెనక సీట్లకు కూడా సీట్‌బెల్ట్ బీప్ వ్యవస్థను తప్పనిసరి చేయాలని ప్రభుత్వం యోచిస్తుంది.

## గ్యాంబ్లింగ్ స్థావరాలపై పోలీసుల దాడి

**-పెద్దఎత్తున నగదు స్వాధీనం, జూదరులు,నిర్వాకులు అరెస్ట్**

**పంజగుట్ట, నవంబర్ 7 (ప్రభాతవార్త):**
గ్యాంబ్లింగ్ స్థావరాలపై పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేసి నిర్వాహకులను, గ్యాంబ్లర్లను అదుపులోకి తీసుకుని నగదు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హైదరాబాద్ పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పక్కా సమాచారంతో జూబ్లీహిల్స్, ఫిలింనగర్ పోలీసు స్టేషన్‌ల పరిధిలోని రెండు అక్రమ గేమింగ్ హౌస్‌లపై దాడులు చేశారు. ఈ దాడిలో ఇద్దరు నిర్వాహకులతో పాటు 13 మంది జూదరులను అరెస్ట్ చేశారు. మధురానగర్‌కు చెందిన యెన్నపూసల మల్లారెడ్డి ఫిలింనగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని పేకాట శిబిరం నిర్వహిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి అరెస్ట్ చేశారు. మల్లారెడ్డి గత జులై నెలలోజూదగృహం నిర్వహిస్తూ పోలీసులకు పట్టుబడడం విశేషం గతంలో పోలీసులకు చిక్కినా పట్టించుకోకుండా తన పద్దతిలో ఈసారి ఫిలింనగర్‌లో పేకాట శిబిరం నిర్వహిస్తూ రెండోసారి పట్టుబడ్డాడు. అదేవిధంగా జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలో మహ్మద్‌నయీమెద్దీన్ అనే వ్యక్తి యూసుఫ్‌గూడలో గతకొంతకాలంగా పేకాట శిబిరం నిర్వహిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి నిర్వాహకుడితో పాటు జూదరులను కూడా అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్, ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో రెండు చోట్ల నిర్వహించిన దాడులోన 13 మందిని అరెస్ట్ చేసి వీరినుంచి 1.34 లక్షల రూపాయలు స్వాధీనం చేసుకుని, స్థానిక పోలీసులకు అప్పగించారు.

## వివక్షను రూపుమాపడానికే కుల గణన : విహెచ్

**హైదరాబాద్, నవంబరు 7,ప్రభాతవార్త:**
రాష్ట్రంలో వివక్షను రూపుమాపడానికే రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టినట్లు మాజీ ఎంపి వి.హనుమంతరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినేత శ్రీ రాహుల్ గాంధీ గారి ఆదేశాల మేరకు, సిఎం రేవంత్ రెడ్డి గారు రాష్ట్ర వ్యాప్తంగా, ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టి ఈ కుల గణన కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు.వి. హనుమంతరావు, అంబర్పేట్ నియోజకవర్గం ఇంచార్జ్ రోహిన్ రెడ్డి సిఎం రేవంత్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం బాగ్ అంబర్పేట్ డివిజన్లో రాహుల్ గాంధీ గారి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా వి హనుమంతరావు గారు మాట్లాడుతూ... రాహుల్ గాంధీ ఆలోచనలకు అనుగుణంగా ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో ప్రారంభించడం జరిగింది. ఇందిరాగాంధీ కుటుంబం భూసంస్కరణలు, దున్నే వాడికి భూమి, బ్యాంకుల జాతీయకరణ చేసిందని.. అదే కోవలోకి వచ్చే ఇందిరాగాంధీ మనవడైన రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నడిచిన తర్వాత తప్పనిసరిగా జనగణనలో కులగనన చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. దానిని అనుసరించి తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను చేపట్టడం జరిగిందన్నారు. దీనిపై కొందరు కోర్టుకు వెళ్లి డెడికేషన్ కమిషన్ వేయాలని కోరగా.. కోర్టు ఆదేశాల మేరకు సీఎం రేవంత్ రెడ్డి డెడికేషన్ కమిషన్ను కూడా ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ కులగనుల ద్వారా బడుగు బలహీన వర్గాలకు భవిష్యత్తులో న్యాయం జరుగుతుందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వారు లబ్ధి పొందే అవకాశం ఉందని తెలిపారు. కుల గణన పై రాహుల్ గాంధీ పట్టుదలతో ఆయన ప్రధానమంత్రి అయితే దేశంలో బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ శ్రీ రోహిణి రెడ్డి గారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ గారు పార్లమెంట్లో కులగనన చేయవలసిందిగా స్లోగన్ ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ. రేవంత్ రెడ్డి గారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఖైరతాబాద్ డి సి సి మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి సమన్యాయం చేయడంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ముందుంటుంది అనడానికి నిదర్శనం అన్నారు. జిహెచ్ఎంసి అధికారులతో కలిసి ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో జి.హెచ్ఎంసి అధికారులు సర్కిల్ నెంబర్ 16 జోనల్ కమిషనర్ మారుతి దివాకర్, డి ఎం ఓ రజిత మేడం లతోకలిసి కుల గణన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రెటరీ ఆర్ లక్ష్మణ్ యాదవ్ ,మాజీ కార్పొరేటర్లు పంజాల జ్ఞానేశ్వర్ గౌడ్ పుల్లనారాయణస్వామి గరిగంటి రమేష్ దిండి రాంబాబు పులి జగన్ పీసీసీ కార్యదర్శులు లక్పతి యాదగిరి గౌడ్ శంభుల శ్రీకాంత్ గౌడ్ పి రామ్మోహన్ రావు కుంకుమ రాజేశ్వరరావు గడ్డం శ్రీధర్ గౌడ్ కోటం అనిల్ రావుల సుధాకర్ షేక్ జమీర్ టి కృష్ణ గౌడ సి సుధాకర్ కిషోర్ శశిధర్ గౌడ్ మహేష్ గౌడ్ సందీప్ గౌడ్ ,ఠాకూర్ హరి తిలక్ సింగ్, ఫరీద జాంగిర బాయ శ్రీనివాస్ రెడ్డి మహిళా నాయకులు సునీత రెడ్డి లావణ్య విజితా రెడ్డి శాంతమ్మ షహనాస ఫాతిమా సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాజ్ కిరణ్ కోట్లకిరణ్ మణికాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వి.హనుమంతరావు, రోహిన్‌రెడ్డి, శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

